

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 37 | హైదరాబాద్ | సోమవారం | 27-07-2026 | పేజీలు: 08


## ఓటు హక్కు 18 ఏళ్లు..
# పోటీకి 25 ఎందుకు?

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్

21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న

ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం

గుజరాత్‌లాగే తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు మిగతా 2లో..



## కార్గిల్ యుద్ధ వీరుల ధైర్యమే
# దేశానికి స్ఫూర్తి

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర వీరులకు ప్రధాని నివాళి

జూలై 26 ప్రతి భారతీయుడు గుర్తుంచుకునే చారిత్రాత్మక రోజు: మోదీ

కార్గిల్ వీరుల ధైర్యసాహసాలు దేశానికి శాశ్వత స్ఫూర్తి

మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల సేవలు మరువలేనివి

'మన్ కీ బాత్'లో కార్గిల్ యుద్ధ వీరుల సేవలను కొనియాడిన ప్రధాని

'శౌర్య విజయ్ యాత్ర' దేశభక్తిని మరింత బలోపేతం చేస్తోంది

'ఒక రైడ్ – ఒక దేశం – ఒక సెల్యూట్' నినాదాన్ని ప్రస్తావించిన మోదీ

నేషనల్ వార్ మెమోరియల్ నుంచి కార్గిల్ వరకు ప్రత్యేక యాత్ర

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** జీవితంలో కొన్ని తేదీలను గుర్తుంచుకోవడానికి క్యాలెండర్ చూడాల్సిన అవసరం ఉండదని, జూలై 26 అలాంటి చారిత్రాత్మకమైన తేదీల్లో ఒకటని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం ప్రసారమైన 136వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర వీరులకు ఘన నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు చూపిన అసాధారణ ధైర్య సాహసాలు మిగతా 2లో..

## విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత నియామకం

రాష్ట్రపతి ఉత్తర్వులతో అదనపు బాధ్యతలు

ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన జోషి

జాతీయ విద్యా విధానాన్ని కొనసాగిస్తానన్న హామీ

ఇప్పటికే రెండు కీలక శాఖల బాధ్యతల నిర్వహణ



02

## రాపిడో డ్రైవర్‌గా మారిన
# తీన్మార్ మల్లన్న

రైడర్ల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు బైక్‌పై పర్యటన

ఆన్‌లైన్ ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను మండలిలో లేవనెత్తుతా: మల్లన్న

ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం

హెల్మెట్ ధరించి రోడ్లపైకి దిగిన ఎమ్మెల్సీ

02




## విద్యార్థులపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగిస్తారా?

అమిత్ షాకు రాహుల్ ఘాటు లేఖ

విద్యార్థులపై బలప్రయోగాన్ని ఖండించిన రాహుల్

పెల్లెట్ గన్‌ల వినియోగంపై వివరణ కోరిన ప్రతిపక్ష నేత

గాయపడిన విద్యార్థి పరిస్థితిపై ఆందోళన

లాఠీచార్జ్‌కు బాధ్యులెవరో చెప్పాలని డిమాండ్

శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు అన్న రాహుల్

పార్లమెంట్ సమావేశాలకు ముందు రాజకీయ ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):** ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన బలప్రయోగం వ్యవహారంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటు మిగతా 2లో..



## బీజేపి అధ్యక్షునివి నీతిమాలిన రాజకీయాలు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విషయంలో నాడు టిఆర్ ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయకుండా నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలనడం బీజేపి అధ్యక్షుడు రామచందరరావు నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మిగతా 2లో..

రామచందర్ రావుపై మంత్రి పొన్నం ఫైర్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ రాజకీయాలు చేస్తోంది: మంత్రి పొన్నం

బీఆర్ఎస్ హయాంలో పేరుకుపోయిన బకాయిలపై బీజేపీ ఎందుకు మౌనం?

దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి: కేంద్రానికి డిమాండ్

డైవర్షన్ పాలిటిక్స్ కోసమే బీజేపీ డ్రామాలు

ఎమ్మెల్యే, ఎంపీ పోటీ వయస్సును 21 ఏళ్లకు తగ్గించే ప్రతిపాదనపై బీజేపీ వైఖరి చెప్పాలి

విద్యార్థి సంఘాల ఎన్నికలకు కాంగ్రెస్ పూర్తి మద్దతు

పరీక్ష పేపర్ లీకేజీలపై బీజేపీకి మాట్లాడే నైతిక హక్కు లేదు

విద్యార్థుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నిధులు ఇవ్వాలి



## ఇందిరమ్మ ఇళ్ల పేరిట
# సైబర్ మోసాలు

నకిలీ కాల్స్, లింకులపై సీపీ హెచ్చరిక

ఈఎండీ పేరుతో డబ్బులు అడిగితే నమ్మొద్దు

అపరిచిత ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు

యూపీఐ పిన్, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు

ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకమన్న సీపీ

02

# జెన్‌జీకి మంత్రి పదవులు ఇవ్వండి

రేవంత్‌కు బండి సంజయ్ సవాల్

యువతకు మంత్రి పదవుల డిమాండ్

ఖాళీ శాఖలు జెన్-జీకి ఇవ్వాలన్న సూచన

కాంగ్రెస్‌పై బీజేపీ నేత విమర్శలు



02



# అస్సాంలో వరద బీభత్సం

66కు చేరిన మృతుల సంఖ్య

ఇంకా 6.54 లక్షల మంది వరద ప్రభావంలోనే

పలు జిల్లాల్లో కొనసాగుతున్న తీవ్ర పరిస్థితి

శిబిరాల్లో వేలాది మంది బాధితులు

బ్రహ్మపుత్ర ఉధృతితో భారీ నష్టం

సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం

**అస్సాం, (ప్రజాక్షేత్రం):** ఇటీవలి భారీ వర్షాలతో అతలాకుతలమైన అస్సాంలో వరదల ఉధృతి కొంత తగ్గినా పరిస్థితి ఇంకా సాధారణ స్థితికి చేరుకోలేదు. రాష్ట్రంలో వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 66కు చేరగా, ఇంకా 6.54 లక్షల మందికి పైగా ప్రజలు వరద ప్రభావంలోనే ఉన్నట్లు అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏఎస్‌డీఎంఏ) వెల్లడించింది. పలు ప్రాంతాల్లో వరద నీరు తగ్గుతున్నప్పటికీ, అనేక గ్రామాలు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం శివసాగర్, చరైదేవో, జోర్హాట్, దిబ్రుగఢ్, గోలాఘాట్, మిగతా 2లో..

## ప్రపంచ దృష్టిని ఆకర్షించిన
# భారత జెన్–జీ

సీజేపీ ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతు

పొరుగు దేశాల్లోనూ ప్రశంసల వెల్లువ

మీమ్స్‌తో మొదలై ఉద్యమంగా మారిన పోరాటం

విద్యాశాఖ మంత్రి రాజీనామాతో మరింత చర్చ

శ్రీలంక, నేపాల్, పాకిస్థాన్ యువత ప్రశంసలు

భారత యువత ఐక్యతపై విదేశీ వ్యాఖ్యలు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా సాగిన 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' ఉద్యమం భారత సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. జెన్-జీపై ఉన్న "ఏకాగ్రత తక్కువ, మిగతా 2లో..



# కార్గిల్ యుద్ధ వీరుల ధైర్యమే దేశానికి స్ఫూర్తి

మొదటిపేజీ తరువాయి

ప్రతి భారతీయుడికి శాశ్వత స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల సేవలను దేశం ఎన్నటికీ మరువదని పేర్కొన్న ప్రధాని, ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ నుంచి కార్గిల్ వార్ మెమోరియల్ వరకు నిర్వహిస్తున్న "శౌర్య విజయ్ యాత్ర"ను ప్రస్తావించారు. "ఒక రైడ్ - ఒక దేశం - ఒక సెల్యూట్" అనే నినాదంతో సాగుతున్న ఈ యాత్ర దేశభక్తిని మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు.

**రక్షణ రంగంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు**

భారత్ రక్షణ రంగంలో స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. ఇటీవల భారత నౌకాదళంలో చేరిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపుదిద్దుకున్న అత్యాధునిక యుద్ధనౌక అని తెలిపారు. ఇందులో 75 శాతానికి పైగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ఆత్మనిర్భర్ భారత్ విజయానికి నిదర్శనమని చెప్పారు.ఇటీవల డీఆర్‌డీవో విజయవంతంగా పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ పరీక్షలు నిర్వహించిందని, అలాగే కుషా క్షిపణి వ్యవస్థ పరీక్ష కూడా విజయవంతమైందని గుర్తు చేశారు. రక్షణ రంగంలో భారత్ సాధిస్తున్న సాంకేతిక పురోగతి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోందని, భారత రక్షణ ఉత్పత్తులపై అంతర్జాతీయ విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు.బ్రహ్మోస్ క్షిపణుల ఎగుమతుల కోసం ఇండోనేషియాతో కుదిరిన ఒప్పందం భారత్‌పై ప్రపంచం పెంచుకున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత రక్షణ పరికరాలు ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలుస్తున్నాయని చెప్పారు.

**విక్రమ్–1తో అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయం**

భారత అంతరిక్ష రంగం మరో చారిత్రాత్మక ఘట్టాన్ని చేరుకుందని ప్రధాని తెలిపారు. విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగం దేశంలోని ప్రతి పౌరుడిని గర్వపడేలా చేసిందన్నారు. ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ విజయవంతం కావడం ద్వారా భారత యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు ప్రపంచానికి తమ ప్రతిభను చాటారని కొనియాడారు. ప్రభుత్వ విధానాలు, యువత ఆవిష్కరణలు కలిసివస్తే భారత్ అంతరిక్ష రంగంలో అగ్రగామిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**క్రీడల్లో యువత సత్తా: తెలుగు తేజం పివి సింధు దేశానికి గర్వకారణం**

భారత యువత క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో విజయాలు సాధిస్తోందని ప్రధాని అన్నారు. ఇటీవల జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ క్రీడాకారిణిగా తెలుగు తేజం పీ.వి. సింధు నిలవడం దేశానికి గర్వకారణమన్నారు. అలాగే లార్డ్స్ వేదికగా భారత మహిళల క్రికెట్ జట్టు తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేయడం భారత మహిళా క్రీడల ఎదుగుదలకు ప్రతీక అని అభినందించారు.

**స్వావలంబనే వికసిత భారత్‌కు పునాది**

భారత్ ప్రస్తుతం రక్షణ, అంతరిక్షం, సాంకేతికత, స్టార్టప్‌లు, తయారీ రంగాల్లో ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి చేరుకుంటోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యువతలో ఆవిష్కరణ స్ఫూర్తి, శాస్త్రవేత్తల కృషి, సైనికుల త్యాగం, ప్రజల భాగస్వామ్యంతో "వికసిత భారత్-2047" లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**పర్యావరణం – ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం**

దేశవ్యాప్తంగా జరుగుతున్న వృక్షారోపణ కార్యక్రమాలు, నీటి సంరక్షణ ఉద్యమాలు, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు సురక్షితమైన భారత్‌ను అందించగలమని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడు దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని ప్రధాని నరేంద్రమోడి అభిలంషించారు.

దేశాభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి పౌరుడు తన రంగంలో అత్యుత్తమంగా పనిచేస్తేనే భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని ప్రధాని అన్నారు. "మనం కలిసి ముందుకు సాగితే అసాధ్యం అనేది ఉండదు. ప్రతి భారతీయుడి సంకల్పమే వికసిత భారత నిర్మాణానికి అసలైన శక్తి" అని మన్ కీ బాత్ సందేశాన్ని ముగించారు.

# జెన్‌జీకి మంత్రి పదవులు ఇవ్వండి

- **రేవంత్‌కు బండి సంజయ్ సవాల్**
- **యువతకు మంత్రి పదవుల డిమాండ్**
- **ఖాళీ శాఖలు జెన్-జీకి ఇవ్వాలన్న సూచన**
- **కాంగ్రెస్‌పై బీజేపీ నేత విమర్శలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శంషాబాద్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ సంచలన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మాటలు చెప్పడం కాదని, చిత్తశుద్ధి ఉంటే 21 నుండి 30 ఏళ్ల వయస్సున్న 'జెన్‌జీ' (GenZ) యువతకు మంత్రి పదవులు ఇచ్చి ఆచరణలో చూపించాలని డిమాండ్ చేశారు. సీఎం వద్ద ఖాళీగా ఉన్న హోమ్, విద్యా, మున్సిపల్ వంటి కీలక శాఖలను యువతకే అప్పగించాలని వ్యాఖ్యానించారు. అవసరమైతే ప్రస్తుతం ఉన్న కొందరు ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి, ఆ పదవులను జెన్‌జీ యువతకు ఇవ్వాలని, కాంగ్రెస్ దృష్టిలో జెన్‌జీ లంటే విహెచ్, కేకే, కోదండరెడ్డి అనుకుంటున్నారా అంటూ సంజయ్ ఎద్దేవా చేశారు.

వయోభారంతో ఉన్న పెద్దలకు యూత్ కోటాలో పదవులు కట్టబెట్టడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని బండి సంజయ్ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ సంస్కృతికి భిన్నంగా భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ "దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, పర్సన్ లాస్ట్" అనే సిద్ధాంతానికే కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ సిద్ధాంతంలో భాగమే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని గుర్తుచేశారు. యువతకు ప్రాధాన్యత ఇస్తున్నామని మాటలతో మోసం చేయకుండా, నిజంగా యువ శక్తిపై నమ్మకం ఉంటే రాష్ట్ర పాలనలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రేవంత్ రెడ్డి సర్కారును సంజయ్ డిమాండ్ చేశారు.

# అస్సాంలో వరద బీభత్సం

మొదటిపేజీ తరువాయి



నాగావ్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. వీటిలో శివసాగర్ జిల్లాలో సుమారు 2.9 లక్షల మంది, చరైదేవోలో 1.9 లక్షల మంది, జోర్హాట్‌లో 1.3 లక్షల మందికి పైగా వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గినా, సహజ పరిస్థితులు పూర్తిగా పునరుద్ధరించబడలేదు.

వరదలతో నిరాశ్రయులైన వేలాది మంది ఇప్పటికీ ప్రభుత్వ సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర నిత్యావసరాలను అధికారులు అందిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన అన్ని విధాలా అండగా నిలుస్తామని ప్రభుత్వం తెలిపింది.

బ్రహ్మపుత్ర నదితో పాటు పలు ప్రధాన నదులు ఉప్పొంగడంతో రహదారులు, వంతెనలు, వ్యవసాయ భూములు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేల ఎకరాల్లో పంటలు నీట మునగగా, అనేక కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయాయి. పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అవసరమైన సహాయ సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

# ఓటు హక్కు 18 ఏళ్లు.. పోటీకి 25 ఎందుకు?

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్‌జీ' తరం గొంతుక చట్ట సభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు.

ఇదే సందర్భంగా తెలంగాణ అభివృద్ధిపైనా రేవంత్ మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని తెలిపారు. "ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే కనీస వయసు 25 సంవత్సరాలు. అదే, రాజ్యసభ సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా పోటీ చేయాలంటే కనీస వయసు 30 సంవత్సరాలు ఉండాలి.

# బీజేపి అధ్యక్షునివి నీతిమాలిన రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

ఎందుకు ప్రశ్నించలేదో సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడినవి కావని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య ఇది అన్నారు. నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దేశంలో తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తుందో స్పష్టం చేయాలన్నారు. విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని కనీసం రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని పంచుకుంటూ కేంద్రం కూడా తన వంతు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.డైవర్షన్ కోసమే ఈ నాటకాలు ఆడుతున్నారని మంత్రి అన్నారు.దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలన్న ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ అంశంపై సమాధానం చెప్పకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ నాయకులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందా? లేదా? ఈ విషయాన్ని రామచంద్రరావు స్పష్టంగా చెప్పాలన్నారు.

**విద్యార్థి సంఘాల ఎన్నికలపై మీ అభిప్రాయం ఏంటో చెప్పండి:**

విద్యార్థి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నది కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన అభిప్రాయం అని ఈ విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో కూడా వెల్లడించాలన్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలకు బీజేపీ మద్దతు ఇస్తుందా? లేదా వ్యతిరేకిస్తుందా? అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి. పరీక్ష పేపర్ల లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న బీజేపీకి, విద్యార్థుల గురించి ప్రశ్నించే కనీస నైతిక అర్హత లేదన్నారు.

# విద్యార్థులపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగిస్తారా?

మొదటిపేజీ తరువాయి

లేఖ రాశారు. జూలై 20న శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగించడం తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో పెల్లెట్ గన్‌ల వినియోగం అత్యంత దిగ్భ్రాంతికరమని లేఖలో విమర్శించారు.

పెల్లెట్ దాడిలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ తీవ్రంగా గాయపడ్డాడని, అతడు కంటి చూపు కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాడని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శాంతియుత నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఇంతటి బలప్రయోగం ఎందుకు జరిగిందో దేశానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై బలప్రయోగానికి, పెల్లెట్ గన్‌ల వినియోగానికి అనుమతి ఎవరు ఇచ్చారో వెల్లడించాలని రాహుల్ లేఖలో ప్రశ్నించారు. లాఠీలతో విద్యార్థులపై దాడి చేసిన సివిల్ డ్రస్‌లోని వ్యక్తులు పోలీసులు లేదా ఇతర వాలంటీర్లా అనే విషయాన్ని కూడా స్పష్టం చేయాలని కేంద్ర హోం మంత్రిని కోరారు.

ఈ ఘటనలో యువతులు సహా వందలాది మంది గాయపడ్డారని రాహుల్ గాంధీ ఆరోపించారు. శాంతియుత నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కు అని, నిరసనకారుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బలప్రయోగానికి బదులుగా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు.

విద్యార్థులపై పోలీసులు బలప్రయోగానికి దిగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. రేపటి నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన లేఖ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారత జెన్–జీ

మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియాకే పరిమితం" అనే అభిప్రాయాలను తలకిందులు చేస్తూ యువత నెల రోజులపాటు సాగించిన నిరసనలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురి చేశాయని, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిన నేపథ్యంలో ఈ ఉద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని అంతర్జాతీయ మీడియా విశ్లేషించింది. సాంప్రదాయ రాజకీయ ప్రచారానికి భిన్నంగా మీమ్స్, రీల్స్, షార్ట్ వీడియోలనే ప్రధాన ఆయుధాలుగా ఉపయోగించడం ఈ ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. నిరసనల నిర్వహణ, పోలీసు చర్యల దృశ్యాలు, సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ కావడంతో ఉద్యమానికి దేశవ్యాప్తంగా, విదేశాల్లోనూ విస్తృత మద్దతు లభించిందని పేర్కొంది.

2022లో ఆర్థిక సంక్షోభంపై భారీ యువజన ఉద్యమాన్ని చూసిన శ్రీలంకలో భారత విద్యార్థుల పోరాటానికి విశేష స్పందన లభించింది. శ్రీలంక కార్టూనిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు భారత యువత ధైర్యాన్ని ప్రశంసిస్తూ పోస్టులు చేశారు. యువత ప్రారంభించిన ఉద్యమాలు ఆసియాలో మార్పుకు నాంది పలుకుతున్నాయని, భారత యువత అదే స్ఫూర్తిని కొనసాగిస్తోందని వ్యాఖ్యానించారు. నేపాల్‌కు చెందిన పలువురు కంటెంట్ క్రియేటర్లు, యువజన నాయకులు కూడా భారత విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. నిరసనకారుల ఆవేదనను అతిగా భావించకూడదని, ఉద్యమం ప్రారంభించిన లక్ష్యాన్ని చివరి వరకు గుర్తుంచుకోవాలని సూచించారు. ఉద్యమంలో ఐక్యత, పట్టుదలే విజయానికి కీలకమని పేర్కొన్నారు. అత్యంత ఆసక్తికరంగా పాకిస్థాన్ యువత నుంచి కూడా భారత జెన్-జీకి ప్రశంసలు వెల్లువెత్తాయి. మత, కుల, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఒక్కటిగా పోరాడిన తీరును పలువురు కొనియాడారు. అవకాశం వస్తే తామూ అలాంటి ఉద్యమంలో పాల్గొనేవారమని కొందరు వ్యాఖ్యానించగా, భారత యువత ధైర్యం తమకు స్ఫూర్తినిస్తోందని మరికొందరు చెప్పారు. పాకిస్థాన్‌లో విద్యార్థి ఉద్యమాలకు ఉన్న పరిమితులను ప్రస్తావిస్తూ, భారత యువతకు లభిస్తున్న ప్రజాస్వామ్య అవకాశాలను ప్రశంసించారు.

సీజేపీ ఉద్యమం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యార్థుల ఐక్యతపై పాకిస్థాన్‌లోని కొన్ని పత్రికలు, విశ్లేషకులు కూడా ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. భారత జెన్-జీ ప్రదర్శించిన సంఘటిత పోరాటం ఆసియా యువతకు కొత్త సందేశంగా మారిందని, సామాజిక మాధ్యమాల శక్తిని ప్రజాస్వామ్య ఉద్యమాల్లో సమర్థంగా వినియోగించిన ఉదాహరణగా ఈ నిరసనలను అభివర్ణించాయి.

# ఇందిరమ్మ ఇళ్ల పేరిట సైబర్ మోసాలు

- **నకిలీ కాల్స్, లింకులపై సీపీ హెచ్చరిక**
- **ఈఎండీ పేరుతో డబ్బులు అడిగితే నమ్మొద్దు**
- **అపరిచిత ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు**
- **యూపీఐ పిన్, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు**
- **ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకమన్న సీపీ**
- **మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచన**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. రూ.10,000 ఈఎండీ చెల్లిస్తే ఇల్లు కేటాయిస్తామని చెప్పే నకిలీ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. "ఈ రోజే చివరి తేదీ" అంటూ భయపెట్టి డబ్బులు కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయరాదని సీపీ స్పష్టం చేశారు. అలాగే AnyDesk, TeamViewer వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇతరుల సూచన మేరకు ఇన్‌స్టాల్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. యూపీఐ పిన్, ఓటీపీ, ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం వంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో దళారులు లేదా మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం లేదని సజ్జనార్ తెలిపారు. దరఖాస్తుదారుడికి ఇల్లు కేటాయించని పక్షంలో చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని ప్రభుత్వమే నేరుగా సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేసి న్యాయం పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాపిడో డ్రైవర్‌గా మారిన తీన్మార్ మల్లన్న

- **రైడర్ల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు బైక్‌పై పర్యటన**
- **అధిక కమిషన్లు, ఆదాయ లోటుపై ప్రత్యక్షంగా అధ్యయనం**
- **ఆన్‌లైన్ ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను మండలిలో లేవనెత్తుతా: మల్లన్న**
- **ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం**
- **హెల్మెట్ ధరించి రోడ్లపైకి దిగిన ఎమ్మెల్సీ**
- **సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన మల్లన్న రాపిడో రైడ్ వీడియో**
- **డ్రైవర్ల హక్కుల కోసం వినూత్న కార్యక్రమంతో ముందుకొచ్చిన టీఆర్‌పీ చీఫ్**
- **గ్రౌండ్ లెవల్‌లో సమస్యలు తెలుసుకునే ప్రయత్నానికి ప్రశంసలు**
- **రాపిడో–ఆటో వివాదం మధ్య మల్లన్న ప్రత్యేక చొరవ**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ ఏది చేసిన జనబాహుళ్యంలోకి వెళ్ళే విధంగా వినూత్న రీతిలో కార్యక్రమం చేస్తారనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇటీవల ర్యాపిడో, ఆటోల మధ్య వివాదం తెలెత్తుతోన్న విషయం విధితమే.కాగా, హైదరాబాద్ నగరంలో రాపిడో బైక్ టాక్సీలు నడుపుతూ జీవనం సాగిస్తున్న రైడర్ల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకునేందుకు శనివారం సాయంత్రం మల్లన్న రోడ్డెక్కారు. స్వయంగా బైక్ నడుపుతూ రాపిడో డ్రైవర్‌గా మారారు. రాష్ట్రంలో రాపిడో డ్రైవర్లు ఎదుర్కొంటున్న అధిక కమిషన్ చార్జీలు, యాప్ కంపెనీల విధానాలు, ఆదాయ లోటు, రోజువారీ ఉపాధి సమస్యలను ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకునేందుకు ఆయన రాపిడో బైక్ నడిపినట్లుగా టీఆర్‌పీ వర్గాలు తెలిపారు. ఆన్‌లైన్ ట్యాక్సీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఈ సమస్యలన్నింటినీ రాబోయే శాసన మండలి సమావేశాల్లో బలంగా ప్రస్తావించి, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ పొందేలా పోరాడతానని ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న వెల్లడించారు. అయితే, సోషల్ మీడియాలో నిత్యం వార్తలు చదువుతూ కనిపించే తీన్మార్ మల్లన్న హెల్మెట్ పెట్టుకుని, బైక్ నడుపుతూ కనిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. డ్రైవర్ల హక్కుల కోసం ఆయన తీసుకున్న ప్రత్యేక చొరవపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత నియామకం**
- **రాష్ట్రపతి ఉత్తర్వులతో అదనపు బాధ్యతలు**
- **ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన జోషి**
- **జాతీయ విద్యా విధానాన్ని కొనసాగిస్తానన్న హామీ**
- **ఇప్పటికే రెండు కీలక శాఖల బాధ్యతల నిర్వహణ**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేంద్ర విద్యాశాఖ అదనపు బాధ్యతలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం అధికారికంగా స్వీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ఈ మేరకు శనివారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ కాగా, ఆదివారం ఆయన విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే వినియోగదారుల వ్యవహారాలు, ఆహార-ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహిస్తున్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను అదనపు బాధ్యతగా కేటాయించారు.

విద్యాశాఖ బాధ్యతలు అప్పగించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రహ్లాద్ జోషి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యారంగంలో కీలక సంస్కరణలు చేపట్టారని, ముఖ్యంగా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడంలో విశేష కృషి చేశారని ప్రహ్లాద్ జోషి కొనియాడారు. ఆయన ప్రారంభించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు.




# కార్గిల్ వీరులకు ఘన నివాళి

- **యువ శౌర్య సేన ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ**

**శంకర్‌పల్లి జులై 26(ప్రజాక్షేత్రం):**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులకు యువ శౌర్య సేన ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శంకర్‌పల్లిలోని యువ శౌర్య సేన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం "యే షూర్ వీరోంకా మార్గ్ హై", "భారత్ మాతాకీ జై", "జై హింద్", "వందే మాతరం" నినాదాలతో కార్యాలయం మారుమోగింది.
ఈ సందర్భంగా యువ శౌర్య సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ మాట్లాడుతూ, 1999లో పాకిస్తాన్ సైనికులు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) దాటి కార్గిల్ పర్వత శిఖరాలను రహస్యంగా ఆక్రమించగా, వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' పేరుతో సాహసోపేతమైన సైనిక చర్యలు చేపట్టిందని తెలిపారు. సముద్ర మట్టానికి 15 వేల నుంచి 18 వేల అడుగుల ఎత్తులో మంచు పర్వతాల మధ్య అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో యుద్ధం సాగిందని, ఈ యుద్ధంలో సుమారు 527 మంది భారత జవాన్లు వీర మరణం పొందారని పేర్కొన్నారు. భారత సైన్యం, భారత వాయుసేన సంయుక్తంగా పోరాడి 1999 జూలై 26 నాటికి శత్రువులను పూర్తిగా తరిమికొట్టి భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాయని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి భారతీయుడు ఎప్పటికీ మరువరాదని ఆయన అన్నారు. అనంతరం యువ శౌర్య సేన ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ, దేశభక్తి ఒకరోజు కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రతి పౌరుడు దేశాభివృద్ధి, జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యతల పట్ల ఎల్లప్పుడూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఉష, సభ్యులు హర్షిని, హనుమంతరావు, నరేష్, హర్షవర్ధన్, హరి హరన్, హేమంత్ కుమార్, క్లెరిస్సాతో పాటు చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేశారు.

# శంకర్ పల్లి నుండి మైతప్ ఖాన్ గూడ వరకు మెయిన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- **బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా...**
- **అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు.**
- **పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోని ప్రభుత్వ యంత్రాగం**

**శంకర్ పల్లి జులై 26(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి నుండి మైతప్ ఖాన్ గూడ వరకు రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా చేసిన, పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉంది. అని ఆదివారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న లక్ష్మారెడ్డి గూడెం గేట్ దగ్గర నిరసన తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన గ్రామాల మెయిన్ రోడ్డుల స్థితిగతులు మారడం లేదు అని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మెయిన్ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వివిధ గ్రామాల ప్రజలు, వాహన దారులు, తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు కొనసాగిస్తున్నారు. అత్యవసరం సమయంలో 108 అంబులెన్స్ సైతం రాలేని దుస్థితి సరైన రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఏండ్లుగా ప్రజలు, రైతులు, ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు అన్ని మాజీ ఎంపీపీ ధర్మాన్న గారి గోవర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి అన్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయిన ప్రధాన రహదారులను పట్టించుకోకపోవడం పై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేసారు. త్వరిత గతిన స్పందించి ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని, వాహనదారులు ప్రమాదవశాత్తు ఇబ్బందులు ఎదురైతే అధికార పార్టీ ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. ఈ ప్రధాన రోడ్డు మార్గాన మూడు జిల్లాల అయిన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. నిరసన కార్యక్రమంలో మహాలింగాపురం సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, మాణిక్యం రెడ్డి, మాజీ ఎంపిటీసీ భవాని యాదగిరి, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు కొంగర మల్లేశం, నరేందర్ రెడ్డి, బొడ వెంకటయ్య, బుచ్చిరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, నారాయణ, నర్సింలు. తదితరులు పాల్గొన్నారు.



# దుర్గామాత అమ్మవారికి మకర తోరణం, కిరీటం సమర్పణ

**శంకర్ పల్లి జులై 26(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్ వార్డు దుర్గామాత అమ్మవారి ఆలయంలో అలంకరణ కోసం మకర తోరణం, కిరీటం, ఛత్రాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సేవను కాడిగళ్ల వీరయ్య తరఫున అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఈ అలంకరణ సామగ్రిని సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో కాడిగల్ల శ్రీకాంత్, శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# కొడంగల్‌పై సీఎం 'మాస్టర్ ప్లాన్'!

- **రాష్ట్ర పటంలో కొత్త శక్తికేంద్రంగా కొడంగల్**
- **ఎడ్యుకేషన్ హబ్.. ఎత్తిపోతల పథకం.. ఇండస్ట్రియల్ హబ్.. రైల్వే లైన్.. రోడ్ల విస్తరణ**
- **తన సొంత నియోజకవర్గాన్ని 'మోడల్ నియోజకవర్గం'గా తీర్చిదిద్దే దిశగా రేవంత్ అడుగులు**
- **జూలై 21న క్షేత్రస్థాయి పర్యటన.. ప్రతి నెలా ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిపై తనిఖీ చేస్తానన్న సీఎం**





ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన కొడంగల్‌ను తెలంగాణలోనే ప్రత్యేక అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గాన్ని కేవలం అభివృద్ధి చేయడం కాకుండా విద్య, సాగునీరు, పరిశ్రమలు, రవాణా, వైద్యం, ఉపాధి రంగాల్లో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చేలా మలచాలన్నది ప్రభుత్వ ప్రణాళికగా కనిపిస్తోంది.
ఇటీవల జూలై 21న కొడంగల్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. హకీంపేటలో నిర్మాణంలో ఉన్న ఎడ్యుకేషన్ హబ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని, ఇకపై ప్రతి నెలా పనుల పురోగతిని తానే పరిశీలిస్తానని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.

కొడంగల్‌కు 'ఎడ్యుకేషన్ హబ్' కిరీటం!
కొడంగల్‌ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలో కీలక అంశం.
మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్, పాలిటెక్నిక్, వ్యవసాయ, వెటర్నరీ తదితర విద్యాసంస్థలతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, సైనిక్ స్కూల్ వంటి సంస్థలను తీసుకురావాలనే ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది.
2025 నవంబర్‌లో సీఎం కొడంగల్ పర్యటన సందర్భంగా రూ.5,000 కోట్ల పెట్టుబడితో సమగ్ర ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను అభివృద్ధి చేసి, దేశవ్యాప్తంగా విద్యార్థులను ఆకర్షించే స్థాయికి కొడంగల్‌ను తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.
ఇది పూర్తయితే కొడంగల్ చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు హైదరాబాద్ వైపు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు స్థానికంగా విద్యా రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.
అయితే ఈ భారీ ప్రణాళికల అసలు పరీక్ష మాత్రం వాటి వేగవంతమైన అమలే.

కృష్ణమ్మ నీళ్లతో కరువు నేలకు జీవం!
కొడంగల్ అభివృద్ధిలో మరో అతిపెద్ద అంశం మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (MNKLIS). కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.
జూన్ 2026లో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ పథకం పనులను పరిశీలించారు. జూలై 21న మరోసారి సమీక్ష నిర్వహిస్తూ భూసేకరణలో జాప్యం ఉండకూడదని, టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని, అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వం సమకూర్చడానికి సిద్ధంగా ఉందని అధికారులకు స్పష్టం చేశారు. అదనపు సర్వేయర్లను కూడా వినియోగించాలని ఆదేశించారు.
ఫిబ్రవరి 2026లో సీఎం ప్రకటించిన ప్రకారం, వచ్చే మూడేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యం ఉంది. నీరు వస్తే.. కొడంగల్ ముఖచిత్రమే మారే అవకాశం!
సాగునీరు అందితే పంటల విస్తీర్ణం పెరగడం, రైతుల ఆదాయంలో మార్పు రావడం, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలపడడం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అందుకే కొడంగల్ అభివృద్ధి ప్రణాళికలో ఎడ్యుకేషన్ హబ్ ఎంత కీలకమో.. ఎత్తిపోతల పథకం కూడా అంతే కీలకం.

**'తెలంగాణ నోయిడా'గా కొడంగల్!**
కొడంగల్‌ను కేవలం వ్యవసాయ నియోజకవర్గంగా కాకుండా పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం. లగచర్ల ప్రాంతంలో పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలను తీసుకురావాలనే ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పారిశ్రామిక అభివృద్ధిలో ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.
2025 నవంబర్‌లో సీఎం మాట్లాడుతూ కొడంగల్‌ను ఢిల్లీ సమీపంలోని నోయిడా తరహాలో "తెలంగాణ నోయిడా"గా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. అంటే కొడంగల్‌కు విద్యతో పాటు పరిశ్రమలు-ఉపాధి-పెట్టుబడులు అనే మూడో ఇంజిన్‌ను జోడించాలన్న మాట.

**70 ఏళ్ల కల.. రైల్వే లైన్!**
కొడంగల్ అభివృద్ధికి మరో కీలక అంశం రైల్వే కనెక్టివిటీ.
వికారాబాద్-పరిగి-కొడంగల్-నారాయణపేట-మక్తల్ మీదుగా కర్ణాటక వైపు రైల్వే అనుసంధానం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రైల్వే లైన్ ఏర్పడితే కొడంగల్‌కు రవాణా, పరిశ్రమలు, వ్యాపారం, విద్య, ఉద్యోగాల పరంగా కొత్త ద్వారాలు తెరుచుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుగా పేర్కొంది.

**రోడ్లు.. వంతెనలు.. కనెక్టివిటీపై భారీ ఫోకస్**
కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం మండల కేంద్రానికి బీటీ రోడ్డుతో అనుసంధానం కావాలని సీఎం తాజాగా అధికారులను ఆదేశించారు.
రోడ్లను బలోపేతం చేయడంతో పాటు కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు పంచాయతీ భవనాలు నిర్మించాలని సూచించారు.
2024లోనే కొడంగల్ నియోజకవర్గంలో డబుల్ లేన్ రోడ్లు, వంతెనలు, రోడ్ల విస్తరణ తదితర పనులకు వందల కోట్ల రూపాయలతో శంకుస్థాపనలు జరిగాయి. 2025 నవంబర్‌లో ఒక్కరోజే రూ.103 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఇందులో కొడంగల్ పట్టణ రోడ్ల విస్తరణకు రూ.60 కోట్లు, అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఫైర్ స్టేషన్, స్విమ్మింగ్ పూల్, గెస్ట్‌హౌస్ తదితర పనులు ఉన్నాయి. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కొడంగల్‌లో విద్యా రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 28 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. మధ్యాహ్న భోజన సదుపాయాలను కూడా విస్తరించే ప్రణాళికను ప్రకటించింది. ఇది కేవలం భవనాల నిర్మాణానికి పరిమితం కాకుండా.. విద్యార్థుల పోషణ, విద్యా ప్రమాణాలు, ఉన్నత విద్యా అవకాశాలు అనే మూడు అంశాలపై దృష్టి పెట్టే ప్రయత్నంగా ప్రభుత్వం చెబుతోంది. తాగునీటిపైనా సీఎం అలెర్ట్ వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొడంగల్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం తాజాగా అధికారులను ఆదేశించారు.
అంటే అభివృద్ధి అంటే కేవలం భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదని.. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, పంచాయతీ భవనాలు, ప్రాథమిక మౌలిక వసతులు కూడా సమానంగా ముఖ్యమే అన్న సంకేతాన్ని సీఎం సమీక్ష ఇస్తోంది.

**కొడంగల్‌పై ఇంత ప్రత్యేక శ్రద్ధ ఎందుకు?**
రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.
కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (KADA) ద్వారా నియోజకవర్గ అభివృద్ధి పనులను సమన్వయం చేసే వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చింది.
దీంతో ఒక్కో శాఖ ఒక్కో పని చేయడం కాకుండా.. విద్య, వైద్యం, సాగునీరు, రోడ్లు, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి వంటి రంగాలను ఒకే అభివృద్ధి విజన్‌లోకి తీసుకురావాలన్న ప్రయత్నం కనిపిస్తోంది.

**2027 డెడ్‌లైన్.. మాట నిలబెట్టుకుంటారా?**
కొడంగల్‌లోని కీలక ప్రాజెక్టులకు డిసెంబర్ 2027 నాటికి గడువు పెట్టినట్లు 2026 మేలో నివేదికలు వెల్లడించాయి.
ఎత్తిపోతల పథకం, లగచర్ల పారిశ్రామిక వాడ, ఎడ్యుకేషన్ హబ్ తదితర ప్రధాన ప్రాజెక్టులను ఆ గడువులో పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.
ఇక్కడే అసలు సవాలు మొదలవుతుంది.
శంకుస్థాపనలు చేయడం ఒక ఎత్తయితే.. పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు అందించడం మరో ఎత్తు.
భూసేకరణ, పర్యావరణ అనుమతులు, నిధుల సమీకరణ, టెండర్లు, నిర్మాణ పనులు, శాఖల మధ్య సమన్వయం——ఇవన్నీ వేగంగా జరిగితేనే 2027 గడువు సాధ్యమవుతుంది.

**కొడంగల్.. సీఎం 'విజన్'కు పరీక్షా వేదిక!**
రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంలో కొడంగల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉండటంతో అదే నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయి అభివృద్ధి నమూనాగా నిలబెట్టే అవకాశం ఆయన చేతుల్లో ఉంది.
ఒకే ప్రాంతంలో.. ఎడ్యుకేషన్ హబ్ఎ త్తిపోతల పథకం ఇండస్ట్రియల్ హబ్ రైల్వే కనెక్టివిటీ రోడ్లు-వంతెనలు వైద్య సదుపాయాలు తాగునీరు-గ్రామీణ మౌలిక వసతులు ఇలా అనేక రంగాల్లో ఒకేసారి పెట్టుబడులు, ప్రాజెక్టులు తీసుకురావాలన్న ప్రణాళిక కొడంగల్ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం కల్పిస్తోంది.

**కొడంగల్‌కు 'రేవంత్ మోడల్' వస్తుందా?**
ఇప్పటి వరకు ప్రకటించిన ప్రణాళికలను చూస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌ను ఒక సాధారణ నియోజకవర్గంగా కాకుండా అభివృద్ధి ప్రయోగశాలగా తీర్చిదిద్దాలని చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే రాజకీయంగా ఆయనకు అసలు విజయం శంకుస్థాపనల సంఖ్యలో కాదు.
ప్రాజెక్టులు పూర్తయ్యాయా?
రైతులకు నీళ్లు అందాయా?
యువతకు ఉద్యోగాలు వచ్చాయా?
విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందా?
రోడ్లు, తాగునీరు, వైద్యం మెరుగుపడ్డాయా?
పరిశ్రమలు వాస్తవంగా వచ్చాయా?
ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలే కొడంగల్‌లో 'అభివృద్ధి మోడల్' నిజంగా రూపుదిద్దుకుందా లేదా అన్నది నిర్ణయించనున్నాయి.
ఫైనల్ పంచ్
కొడంగల్‌ను మార్చాలన్న రేవంత్ సంకల్పం.. ఇప్పుడు అమలు దశలో!

**సీఎం సొంత నియోజకవర్గం.. అందుకే ప్రత్యేక ఫోకస్**
ఎడ్యుకేషన్ నుంచి ఇండస్ట్రీ వరకు.. ఇరిగేషన్ నుంచి రైల్వే వరకు భారీ ప్రణాళికలు
2027 డెడ్‌లైన్‌లోపు కీలక పనులు పూర్తి చేయడమే అసలు సవాలు
కొడంగల్‌కు ఇప్పటివరకు వచ్చిన హామీలు, శంకుస్థాపనలు, ప్రాజెక్టులు కాగితాల నుంచి క్షేత్రస్థాయికి ఎంత వేగంగా దిగుతాయన్నదే ఇప్పుడు కీలకం.
అవి పూర్తయి.. విద్య, సాగునీరు, పరిశ్రమలు, ఉపాధి, రవాణా రంగాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తే మాత్రం——
"కొడంగల్.. సీఎం సొంత నియోజకవర్గం" అనే గుర్తింపును దాటి.. "తెలంగాణ అభివృద్ధి మోడల్"గా నిలిచే అవకాశం ఉంది.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777

## వార్డు అభివృద్దే నా లక్ష్యం కౌన్సిలర్ వన్నెపాగ ఉషా విజయ్ కుమార్..

- **6 లక్షల వ్యయంతో భూగర్భ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం.**

**శంకర్ పల్లి జూలై 26(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మున్సిపల్ కేంద్రంలోని 6 వార్డు చిన్న శంకర్ పల్లిలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, సహకారంతో కౌన్సిలర్ ఉషా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 6 లక్షల రూపాయలు నిధులతో నూతనంగా భూగర్భ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వార్డు ప్రజలతో కలిసి పూజ చేసి కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఉషా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి నన్ను ఆశీర్వదించిన నా వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అభివృద్ధి దిశగా పని చేస్తానని, వర్షాకాలంలో మురుగు నీరు వల్ల దోమలు ప్రభలడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడం వలన, భూగర్భ అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టాలని, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సౌకర్యాలను, అర్హత పొందిన ప్రజలకు, సద్వినియోగం చేస్తానని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండు రంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, వన్నెపాగ భిక్షపతి, నర్సింలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **సర్పంచ్ గొడుగు యాదయ్య**
- **కేతిరెడ్డిపల్లిలో ముమ్మరంగా దోమల నివారణ మందు పిచికారీ**

**మొయినాబాద్,జులై 26(ప్రజాక్షేత్రం):**



ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య పిలుపునిచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యగా ఆదివారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఊరంతా ముమ్మరంగా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. గ్రామంలోని మురుగుకాల్వలు,వీధులు,నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో క్రిమిసంహారక మందులు చల్లే కార్యక్రమాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొడుగు యాదయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామంలో పారిశుధ్య పనులను వేగవంతం చేశాం. పరిశుభ్రత పాటించడం ద్వారానే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. గ్రామస్తులు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటూ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు రంగారెడ్డి, కన్నెపల్లి మోటార్లు వెంటనే ప్రారంభించాలి

- రాజకీయాలు పక్కనపెట్టి రైతులకు సాగునీరు అందించాలి
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి,జూలై 26 (ప్రజాక్షేత్రం):** రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి పాలమూరు ఎత్తిపోతల పథకం మోటార్లు, కన్నెపల్లి మోటార్లను వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతల పథకాల మోటార్లను ప్రారంభించి రైతుల పంటలకు నీటి కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తాబేదారుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమైక్యవాదిగా వ్యవహరిస్తున్నారని, తెలంగాణ ప్రయోజనాల కంటే ఇతర అంశాలపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలంగాణ రైతుల అవసరాలు, ప్రజల ఆకాంక్షలపై చిత్తశుద్ధి కనిపించడం లేదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల నుంచి వెంటనే మోటార్లను ప్రారంభించి రైతులకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని సద్వినియోగం చేసుకుని జలాశయాలను నింపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు.

ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే మోటార్లను ప్రారంభించాలని, కుంటి సాకులు చెప్పి రైతుల పొలాలను ఎండబెట్టొద్దని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితులు ఏర్పడతాయని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

# మంత్రి చేతుల మీదుగా బెస్ట్ కౌన్సిలర్ జాతీయ అవార్డు అందుకున్న బుడుమల యాదగిరి

**మహేశ్వరం జూలై26 (ప్రజాక్షేత్రం):** మహేశ్వరం నియోజకవర్గం పరిధి బాలాపూర్ మండలం జల్‌పల్లి సర్కిల్ పరిధిలోని 16వ వార్డు మాజీ కౌన్సిలర్ బుడుమల యాదగిరి బెస్ట్ కౌన్సిలర్ జాతీయ అవార్డును అందుకున్నారు.హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 16వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన బుడుమల యాదగిరి వార్డు ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,వార్డు అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తున్న ఆయనకు ఈ అవార్డు దక్కడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతూ,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని బుడుమల యాదగిరి తెలిపారు.ప్రజల ఆశీర్వాదం,సహకారంతో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ అధ్యక్షుడు దేశాల భూపాల్,బహుజన సాహిత్య అకాడమీ చైర్మన్ రాధాకృష్ణ,తెలంగాణ రాష్ట్ర బహుజన అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



# శిథిలావస్థలో సీతారామ కెనాల్ బ్రిడ్జి.. భారీ ప్రమాదానికి కౌంట్‌డౌన్!

- జింకలగూడెం ప్రధాన రహదారిపై భారీ గోతులు
- బయటపడిన ఇనుప రాడ్లు.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్



**బూర్గంపాడు జూలై 26 (ప్రజాక్షేత్రం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని అంజనాపురం-జింకలగూడెం ప్రధాన రహదారిపై ఉన్న సీతారామ ప్రాజెక్టు కెనాల్ బ్రిడ్జి అత్యంత ప్రమాదకర స్థితికి చేరుకుంది.రోజురోజుకూ బ్రిడ్జి కాంక్రీట్ పూర్తిగా దెబ్బతింటుండగా, ఇనుప రాడ్లు బయటకు రావడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకల కారణంగా రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ఈ గోతుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటికీ మరమ్మతులపై దృష్టి సారించకపోవడం స్థానికుల్లో ఆగ్రహానికి కారణమైంది.ఈ రహదారి ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు.అయినప్పటికీ బ్రిడ్జి దుస్థితిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.స్థానికులు పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బ్రిడ్జిపై ఏర్పడిన గోతులు మరింత విస్తరిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళన నెలకొంది.పెద్ద ప్రమాదం సంభవించకముందే సీతారామ కెనాల్ బ్రిడ్జికి అత్యవసర మరమ్మతులు చేపట్టి, వాహనదారుల ప్రాణాలను కాపాడాలని స్థానిక ప్రజలు,వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# కాంగ్రెస్‌లో కుల చిచ్చు!

- "దళిత ఎమ్మెల్యేలను అణిచేస్తున్నారు.. ఇక ఊరుకునేది లేదు"
- అగ్రకుల నేతల తీరుపై మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు
- "ఒక్క మందుల సామేల్‌కే కాదు.. మా దళిత ఎమ్మెల్యేలందరికీ ఇదే పరిస్థితి"
- భట్టి విక్రమార్కకు సమస్యలన్నీ వివరించాం.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్న ఎమ్మెల్యే




**వికారాబాద్ జూలై 26(ప్రజాక్షేత్రం):** అధికార కాంగ్రెస్‌లో అంతర్గతంగా ఉన్న సామాజిక, రాజకీయ అసంతృప్తి మరోసారి బహిర్గతమైంది. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన తాజా వ్యాఖ్యలు పార్టీలో కొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. కాంగ్రెస్‌లోని అగ్రకుల నేతల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, దళిత ఎమ్మెల్యేలు అణిచివేతకు గురవుతున్నారని, వారి నియోజకవర్గాలకు కూడా అదే పరిస్థితి ఎదురవుతోందని ఆరోపించారు."ఒక్క మందుల సామేల్‌కే కాదు.. మా దళిత ఎమ్మెల్యేలు అందరికీ ఇలానే జరుగుతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నాయి. ఇప్పటివరకు పార్టీ అంతర్గతంగా వినిపించిన అసంతృప్తి బహిరంగ వ్యాఖ్యల స్థాయికి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**'ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదు'**

దళిత ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు, అభివృద్ధి పనుల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందన్న భావన తమలో ఉందని కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. "దళిత ఎమ్మెల్యేలు అణిచివేతకు గురవుతున్నారు.. మా నియోజకవర్గాలు అణిచివేతకు గురవుతున్నాయి. ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు కేవలం ఒక నియోజకవర్గానికి సంబంధించిన సమస్యగా కాకుండా, కాంగ్రెస్‌లోని దళిత ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం, నిధుల కేటాయింపు, ప్రభుత్వ నిర్ణయాల్లో వారికి దక్కుతున్న ప్రాధాన్యంపై పెద్ద చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

**భట్టికి ఫిర్యాదుల పర్వం..**

తమ సమస్యలన్నింటినీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు కవ్వంపల్లి తెలిపారు. దళిత ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించామని, వాటిని పరిష్కరిస్తానని భట్టి హామీ ఇచ్చారని వెల్లడించారు. దళిత ఎమ్మెల్యేల అసంతృప్తిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని, తమ నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులు, సంక్షేమ పథకాల కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు ఆయన చెప్పారు.

**ఎస్సీ ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి**

ఎస్సీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కవ్వంపల్లి తెలిపారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు, అభివృద్ధి బిల్లుల విషయంలో కూడా తమ నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. దళిత ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**'మా నియోజకవర్గాలకు అదనంగా వెయ్యి ఇళ్లు ఇవ్వాలి'**

సంక్షేమ పథకాల అమలులోనూ దళిత ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కవ్వంపల్లి డిమాండ్ చేశారు. ముఖ్యంగా తమ నియోజకవర్గాలకు అదనంగా వెయ్యి ఇళ్లను కేటాయించాలని కోరినట్లు వెల్లడించారు.అభివృద్ధి నిధుల కేటాయింపుతో పాటు పేదల ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలులో కూడా సమాన అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు.

**కాంగ్రెస్‌లో కొత్త సమీకరణాలకు సంకేతమా?**

కవ్వంపల్లి సత్యనారాయణ వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌లో రాజకీయంగా ఆసక్తికరమైన పరిణామానికి దారితీస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే బహిరంగంగా "దళిత ఎమ్మెల్యేలను అణిచివేస్తున్నారు" అంటూ వ్యాఖ్యానించడం పార్టీ అంతర్గత పరిస్థితులపై చర్చకు కారణమవుతోంది.ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు నిధులు, అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న సమయంలో కవ్వంపల్లి వ్యాఖ్యలు రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.ఇది ఒక్క ఎమ్మెల్యే వ్యక్తిగత అసంతృప్తేనా? లేక కాంగ్రెస్‌లోని దళిత ఎమ్మెల్యేలలో విస్తృతంగా ఉన్న అసంతృప్తికి ఇది ప్రతిబింబమా? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**'సామాజిక న్యాయం' నినాదం.. ఆచరణలో అసంతృప్తి?**

కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, దళిత సాధికారత, సమాన ప్రాతినిధ్యం వంటి అంశాలను రాజకీయంగా ప్రధానంగా ప్రస్తావిస్తున్న నేపథ్యంలో.. అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే నుంచి "దళిత ఎమ్మెల్యేలు అణిచివేతకు గురవుతున్నారు" అనే ఆరోపణ రావడం రాజకీయంగా విరుద్ధమైన సందేశాన్ని ఇస్తోంది.ప్రభుత్వంలో కీలక పదవుల్లో దళిత ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తమ నియోజకవర్గాలకు తగిన స్థాయిలో నిధులు, అభివృద్ధి అవకాశాలు అందడం లేదనే అసంతృప్తి ఉంటే దానిని ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందన్నది కీలకంగా మారింది.

**'ఇక ఊరుకోం'.. కాంగ్రెస్‌లో అసంతృప్తి అగ్నికి ఆజ్యం?**

"ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదు" అన్న కవ్వంపల్లి హెచ్చరిక ఇప్పుడు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అంతర్గత సమస్యలను అధిష్ఠానం ఏ విధంగా పరిష్కరిస్తుంది? దళిత ఎమ్మెల్యేల డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ప్రత్యేక నిధులు, అదనపు ఇళ్ల కేటాయింపుపై స్పష్టత ఎప్పుడు వస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఒకవైపు అధికారంలోకి వచ్చి ప్రభుత్వాన్ని నడుపుతున్న కాంగ్రెస్.. మరోవైపు తన సొంత ఎమ్మెల్యేల నుంచి వస్తున్న అసంతృప్తిని సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

కవ్వంపల్లి వ్యాఖ్యలు ఇక్కడితో ఆగుతాయా? లేక మరికొందరు దళిత ఎమ్మెల్యేలు కూడా ఇదే స్వరం వినిపిస్తారా?

అదే జరిగితే ఇది ఒక ఎమ్మెల్యే అసంతృప్తిగా కాకుండా కాంగ్రెస్‌లో దళిత ఎమ్మెల్యేల ప్రత్యేక రాజకీయ సమీకరణానికి బీజం వేసే పరిణామంగా మారే అవకాశం ఉంది.

**ఇప్పుడు బంతి కాంగ్రెస్ ప్రభుత్వ కోర్టులోనే..**

దళిత ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏ మేరకు అమలు చేస్తుందన్నదే ఇప్పుడు కీలకం. ప్రత్యేక నిధులు, బడ్జెట్‌లో ప్రాధాన్యం, అదనపు ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే వివాదం సద్దుమణిగే అవకాశం ఉంది.

లేకపోతే "దళిత ఎమ్మెల్యేలను అణిచివేస్తున్నారు" అన్న ఆరోపణలు మరింత బలపడి, కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయాలను కొత్త మలుపు తిప్పే ప్రమాదం లేకపోలేదు.

కాంగ్రెస్‌లో కుల చిచ్చు రగిలిందా? లేక ఇది నిధులు-అభివృద్ధిపై ఎమ్మెల్యేల అసంతృప్తి మాత్రమేనా?

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలే దీనికి సమాధానం చెప్పనున్నాయి.



# ఈకెవైసి చెయ్యకపోతే రేషన్ కార్డులు కోల్పోయే అవకాశం

- 7వ వార్డులో దగ్గరుండి ప్రక్రియను చేస్తున్న కౌన్సిలర్ వకీల్

**జహీరాబాద్ జూలై 26 (ప్రజాక్షేత్రం):** రేషన్ కార్డులను కోల్పోకూడదంటే పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చెయ్యడం తప్పనిసరి అని స్థానిక వార్డు కౌన్సిలర్ చవాన్ వకీల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని హౌతి కే వార్డ్ నెంబర్ 7లో ఆదివారం నాడు కౌన్సిలర్ వకీల్ చౌహన్ ఆధ్వర్యంలో పౌరసరపర శాఖకు సంబంధించి రేషన్ కార్డు యొక్క కేవైసీ ని నిర్వహించడం జరిగింది. ఇందులో వార్డ్ నెంబర్ 7 కి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి జైపాల్, తెలంగాణ ఉద్యమ కారుడు శేఖర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# సర్ కార్యక్రమంతో ఓటరు జాబితా సవరణ వేగవంతం

- ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో తొలి వార్డులో ప్రక్రియ పూర్తి
- చుక్క రాజు

**వనపర్తి,జూలై 26 (ప్రజాక్షేత్రం):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని తొలి వార్డులో వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు బీఎల్ఏ చుక్కా రాజు తెలిపారు. ఆదివారం 1వ వార్డులో అమ్మవారి ఆలయం పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి ఓటరు హక్కు సంబంధిత దరఖాస్తులు, అవసరమైన పత్రాలను స్వీకరించారు. ఇంకా పత్రాలు అందని ఓటర్లను గుర్తించి వారికి దరఖాస్తులను పంపిణీ చేయడంతో పాటు, వాటిని పూర్తిగా నింపి వీలైనంత త్వరగా సమర్పించాలని ప్రజలకు సూచించారు. ప్రతి అర్హుడి వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని, తొలి వార్డులో సర్ కార్యక్రమాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని చుక్కా రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కృష్ణవేణి,సూపర్‌వైజర్ మండల సురేష్,స్వర్ణలత,అరవింద్, మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఇంకుడు గుంత లేకుంటే... రేపటి నీటి భద్రతే ప్రశ్నార్థకం!

- బెంగళూరులా కాకముందే... తెలంగాణ మేల్కోవాలి!వర్షపు నీటి సంరక్షణపై హెచ్చరిక
- ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత... ప్రతి బోరుకు జీవనాధారం



**కుత్బుల్లాపూర్,జూలై 26 (ప్రజాక్షేత్రం):** వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడమే భవిష్యత్ తరాలకు తాగునీటి భద్రత కల్పించే ఏకైక మార్గమని పర్యావరణ సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. తన ఇంట్లో 25 సంవత్సరాల క్రితమే 14 అడుగుల లోతుతో ఇంకుడు గుంత నిర్మించి ప్రతి ఏడాది శుభ్రపరుస్తూ నిర్వహిస్తున్నానని తెలిపారు. అదే కారణంగా 15 సంవత్సరాల క్రితం వేసిన 300 అడుగుల బోరులో ఇప్పటికీ సమృద్ధిగా నీరు వస్తోందని చెప్పారు.

నగరాల్లో ఎక్కడ చూసినా సిమెంట్ రోడ్లు, భారీ అపార్ట్‌మెంట్లు పెరగడంతో వర్షపు నీరు భూమిలోకి వెళ్లే అవకాశం పూర్తిగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో 3,000 అడుగుల బోర్లు వేసినా నీరు దొరకని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వరుసగా ఒకటి లేదా రెండు సంవత్సరాలు వర్షాభావం నెలకొంటే బెంగళూరును మించిన నీటి సంక్షోభం తెలంగాణలో కూడా వచ్చే అవకాశం ఉందన్నారు.

కొత్తగా బోరు వేయాలంటే ముందుగా ఇంకుడు గుంత ఏర్పాటు చేయడాన్ని తప్పనిసరి చేయాలని, లేకపోతే బోర్‌ను సీజ్ చేసి కనీసం రూ.1 లక్ష జరిమానా విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే హెచ్‌ఎండీఏ భవన అనుమతులు, ఇంటి రిజిస్ట్రేషన్, అపార్ట్‌మెంట్ అనుమతుల్లో రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని సూచించారు.

గతంలో జీహెచ్‌ఎంసీ నిర్మించిన వందలాది ఇంకుడు గుంతలు ప్రస్తుతం చెత్తతో మూసుకుపోయాయని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గేటెడ్ కమ్యూనిటీలు, పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లలో కూడా వర్షపు నీరు బయటకు వెళ్లకుండా రీచార్జ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, పరిశ్రమలకు తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రత్యేక నోటీసులు జారీ చేయాలని సూచించారు.

"వర్షపు నీటిని కాపాడుకోవడం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు తాగునీటిని భద్రపరిచే సామాజిక బాధ్యత" అని కోల రవీందర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.





# వర్షం కోసం ప్రత్యేక పూజలు

**వలిగొండ జూలై 26(ప్రజాక్షేత్రం):**

మండలంలోని గోల్నేపల్లి గ్రామంలో ఆదివారం వర్షాలు సమృద్ధిగా కురియాలని, పంటలకు నీటి సమస్య రావద్దని కోరుతూ మహిళలు బొడ్రాయికి నీళ్లు పోసి పూజలు నిర్వహించారు. అంతకు ముందు బొడ్రాయి వద్ద నీటి బిందెలతో మహిళలు వరుణుడి కరుణ కోసం బతుకమ్మ ఆటలు ఆడుతూ,పాటలు పాడారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నంశెట్టి రాణి మధు,ఉప సర్పంచ్ వెల్దండ కృష్ణ రెడ్డి,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ జూలై 26(ప్రజాక్షేత్రం):**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా భువనగిరి పట్టణంలో కుమ్మరి కులస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక బోనాల మహోత్సవంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి  పాల్గొన్నారు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడూరి నర్సింహా గారి ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి  అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సాంస్కృతిక విలువలను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో భువనగిరి నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో
వర్ధిల్లాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు,కుమ్మరి సంఘం ప్రతినిధులు,మహిళలు,భక్తులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మధుర గాయనికి స్వర నీరాజనం

**భద్రాచలం,జూలై26(ప్రజాక్షేత్రం)**



సుప్రసిద్ధ సినీ గాయని ఎస్.జానకమ్మ కి నివాళులు అర్పిస్తూ ఆమె స్మృతిలో స్వర నీరాజనం కార్యక్రమం ఆదివారం నాడు స్థానిక కమ్మ సత్రం లో జరిగింది. ఆమె పాడిన మధురమైన గీతాలను పలువురు గాయనీగాయకులు ఆలపించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.పురప్రముఖులు,ఇతర ప్రాంతాల నుంచి కూడా సంగీతాభిమానులు  హాజరయ్యారు.గోళ్ళ భూపతిరావు,డా.విజయ రావు,నిట్టా రాజు ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది.సినీ సంగీత దర్శకుడు గంటా కృష్ణ,దుర్గాచారి,జె.ఎన్.మూర్తి,భూషణ రావు,ఇర్పా అనసూయ ఇంకా తదితరులు ఫాల్గొన్నారు.



# పేకాటస్థావరంపై పోలీసుల మెరుపు దాడి..

- 12మందిపై కేసు నమోదు..
- 26వేల నగదు స్వాధీనంతోపాటు 11ఫోన్లు సీజ్..
- వివరాలు వెల్లడించిన చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్..

**చిగురుమామిడి,జూలై 26 (ప్రజాక్షేత్రం):**




మండల పరిధిలోని రేకొండ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి మెరుపు దాడి నిర్వహించారు.నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు జరిపిన ఈ దాడిలో మొత్తం 12మంది పేకాటరాయుళ్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 26వేల రూపాయల నగదుతోపాటు,జూదానికి ఉపయోగిస్తున్న 11స్మార్ట్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్సై జగదీశ్వర్ హెచ్చరించారు.నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# పైలట్ రోహిత్ రెడ్డిని కలిసిన ఇందూరు బీఆర్ఎస్ యువ నాయకులు

- వడ్డె రమేష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన యువ నాయకులు
- పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం
- - పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై యువ నాయకులకు దిశానిర్దేశం చేసిన రోహిత్ రెడ్డి
- యువత పాత్ర కీలకమని పిలుపు
- పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని సూచన
- ఆత్మీయ వాతావరణంలో జరిగిన భేటీ

**పెద్దేముల్,జులై 26 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు ఆదివారం  యువ నాయకుడు వడ్డె రమేష్ ఆధ్వర్యంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు,యువత పాత్ర తదితర అంశాలపై మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి యువ నాయకులతో చర్చించారు.ఈ సందర్భంగా ఇందూరు బీఆర్ఎస్ యువ నాయకులతో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసు



కెళ్లడంతో పాటు గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.యువ నాయకులు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని రోహిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.
అనంతరం ఇందూరు గ్రామ బీఆర్ఎస్ యువ నాయకులు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

## డిజిటల్ యుగంలో ఆధునిక పోకడలకు పెద్దపీట వెయ్యాలి

- అన్నీ రంగాల సేవలను ఒకే వేదికపై తేవడం కోసమే జిప్లో యాప్
- పట్టణంలో జీప్లో స్టార్టప్ యాప్ ను ప్రారంభించిన స్థానిక పిపి సుభాష్ రాథోడ్

**జహిరాబాద్ జూలై 26 (ప్రజాక్షేత్రం):**

అన్నీ రంగాల సేవలను ఒకే ప్లాట్ ఫారంపై తేవాలనే సంకల్పన్ని స్థానిక కోర్టు పబ్లిక్ ప్రసిక్యూటర్ సుభాష్ రాథోడ్ అభినందిస్తు భవిషత్తులో ఈ కార్యంలో విజయవంతం అవ్వాలని ఆకాంక్షించారు. జహిరాబాద్ పట్టణంలోనీ మంకల్ బంక్వెట్ హాల్ పక్కన భారత ప్రభుత్వ డిపిఐఐటి ద్వారా గుర్తింపు పొందిన స్టార్టప్ సంస్థ "జిప్లో- అల్ ఇన్ వన్ హైపార్ లోకల్ యాప్" సంస్థ సిఈఓ రమేష్ రాథోడ్ మరియు డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక రాథోడ్ ల ఆహ్వానం మేరకు నూతన వ్యాపార సముదాయ ప్రారంభోత్సవ  కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జహీరాబాద్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాథోడ్ సుభాష్ హాజరై రిబ్బన్ కట్ చేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్థానిక వ్యాపారులు, వినియోగదారులు మరియు వివిధ రంగాలకు చెందిన సేవలందించే వారందరినీ ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకువచ్చే జిప్లో యాప్ జహీరాబాద్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.  సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు, ఆహ్వానితులకు సంస్థ సిఈఓ రమేష్ రాథోడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప,మండలం పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, సర్పంచులు దాసరి మంచేందర్, కేతావత్ మోహన్,గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచులు అమిత్ కుమార్,జగదీష్,సర్పంచ్ ప్రతినిధి భీమ్ రావు రాథోడ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హిరు రాథోడ్, ప్రకాష్ చవాన్, అశోక్,ప్రకాష్ రెడ్డి,విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ యువజన సంఘం సదాశివపేట పట్టణ మరియు మండల అధ్యక్షుడిగా చిరంజీవి (చిరు) ఏకగ్రీవ ఎన్నిక

**సంగారెడ్డి,జూలై 26(ప్రజాక్షేత్రం):**

అంబేద్కర్ యువజన సంఘం సదాశివపేట పట్టణ మరియు మండల అధ్యక్షుడిగా శ్రీ చిరంజీవి (చిరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీ పంబల్ల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా చిరంజీవి (చిరు) గారికి నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను యువతలో మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు సంఘం కృషి చేస్తోందని, నూతన అధ్యక్షుడు చిరంజీవి (చిరు) నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీ చిరంజీవి (చిరు) మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, యువత సాధికారత కోసం సదాశివపేట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సదాశివపేట పట్టణానికి సంబంధించిన కమిటీ ఏర్పాటు చేస్తూ కమిటీ ఉప అధ్యక్షులుగా ఎం.సాయి కుమార్ మరియు బి. అనూప్ కుమార్ ప్రధాన కార్యదర్శులుగా ఎస్. సుధాకర్, పి. మహేష్, పి .భరత్, ఏ.విజయ్ కుమార్, బి. నరేష్ లను నియమిస్తూ పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే సదాశివపేట మండల పరిధిలోని ప్రతి గ్రామంలో త్వరితగతిన అంబేద్కర్ యువజన సంఘం కమిటీలను ఏర్పాటు చేసి, యువతను సంఘటితం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, రాజ్యాంగ విలువల ప్రచారం చేపడతామని తెలిపారు. యువత అందరూ సంఘం అభివృద్ధికి సహకరించి అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, యువజన సభ్యులు, అంబేద్కర్ అభిమానులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడు చిరంజీవికి శుభాకాంక్షలు తెలియజేశారు.






## మైత్రి నగర్ అభివృద్ధికి కొత్త కమిటీ...
# కార్యాచరణకు శ్రీకారం

- ప్రజల స్వరం నాయకుడి ముందుకు...మైత్రి నగర్ అభివృద్ధిపై చర్చ
- కాలనీ అభివృద్ధికి కమిటీ కదిలింది...వారాల వినోద్ హామీ

**కుత్బుల్లాపూర్,జూలై 26 (ప్రజాక్షేత్రం):**

సాయిబాబా నగర్మై త్రి నగర్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఇటీవల ఏర్పాటైన నూతన కమిటీ స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజల ఆకాంక్షలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలను కమిటీ సభ్యులు వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక కమిటీ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ సమావేశంలో మైత్రి నగర్ అధ్యక్షుడు గట్టు అశోక్, జనరల్ సెక్రటరీ కృష్ణ,ట్రెజరర్ ఆంజనేయులు,వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ,హరి నాయుడు, అడ్వైజర్లు లక్ష్మణ్,వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కృష్ణ పటేల్, ట్రెజరర్ ఉపేంద్ర,ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరరావు, సోమరాజు యాదవ్, సాంబశివ కుమార్,పృథ్వి,సీహెచ్ పండు, జి.శివకుమార్,రాజమౌళి,సాయి యాదవ్,ప్రేమానంద్,  జస్వీర్,ఎండిమిరాజ్,జి. రవి, జయప్రకాశ్‌తో పాటు కమిటీ సభ్యులు ,స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# సేవకు చిరునామా..బికేఆర్ ఫౌండేషన్

- బికేఆర్ ఫౌండేషన్ తో గ్రీన్ హిల్స్‌లో 54వ ఉచిత వైద్య శిబిరం
- 54వ వైద్య శిబిరాన్ని సందర్శించిన మైనంపల్లి

**కుత్బుల్లాపూర్,జూలై 26 (ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ 294వ డివిజన్ బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో నిర్వహించిన 54వ ఉచిత వైద్య శిబిరాన్ని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు, తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి సందర్శించారు. వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను పరిశీలించి, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గ్రీన్ హిల్స్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి,భూపతి రెడ్డి, శ్రీధర్ రెడ్డి,కావలి గణేష్,శ్రీశైలం యాదవ్,సాధు యాదవ్, నర్సింహారెడ్డి,అమర్ పటేల్, బీరా యాదవ్,శివారెడ్డి, 294వ డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ వాసులు,టీమ్ బీకేఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## గోల్కొండ తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ జులై26(ప్రజాక్షేత్రం):**

కళా సిండికేట్' ఆధ్వర్యంలో ఆదివారం గోల్కొండలోని బంజారా దర్వాజా వద్ద గల హనుమాన్ మందిర్ ప్రాంగణంలో ఘనంగా జరిగిన 'బోనాల జాతర గోల్కొండ తొట్టెల ఊరేగింపు' కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ , పాల్గొన్నారు.
మాజీ కౌన్సిలర్ శ్రీ మక్తాల కృష్ణగౌడ్ , ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ఈ వైభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ ఘనమైన ఊరేగింపు ఉత్సవాల్లో రాఘవ్, రాహుల్, ఎల్.ఎన్.ఆర్ వరుణ్ తేజ్ తదితర నిర్వాహకులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు, స్థానిక ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## నూతన సీఐకి ఘన సన్మానం.

**శంషాబాద్ జులై26(ప్రజాక్షేత్రం):**

ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కు ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ సురేందర్ రెడ్డి ని శంషాబాద్ మండల పార్టీ నాయకులు నరసింహ, ఉప సర్పంచ్ పిల్లి శ్రీశైలం, జుర్కి రమేష్ పటేల్, సుధాకర్, మహేష్ ముదిరాజ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.



## ఓటరు జాబితాపై సమీక్ష..

- **బాధిత కుటుంబాలకు పరామర్శ**
- **వనపర్తిలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి,జులై 26 (ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని 9వ వార్డులో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు, బీఎల్ఏలకు పలు సూచనలు చేస్తూ, అర్హులెవరూ జాబితా నుంచి మినహాయించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సమగ్ర ఓటరు నమోదు అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనంతరం వనపర్తి మండలం రాజపేట గ్రామ సర్పంచ్ గౌడుగు ఎల్లయ్య మాతృమూర్తి చెన్నమ్మ మృతికి సంతాపం తెలియజేస్తూ వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. అదే విధంగా వనపర్తి పట్టణ 21వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు మంద రాము మాతృమూర్తి సవరమ్మ మృతిపట్ల కూడా నిరంజన్ రెడ్డి సంతాపం తెలిపారు. వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు రఘువరన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ధర్మనాయక్, మాధవ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు దేవర్ల నరసింహ, డేగ మహేశ్వర్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, చిట్యాల రాము, సుధాకర్ గౌడ్, గంధం పరంజ్యోతి, సీపీఎం నాయకుడు డి. కురుమయ్య, డేవిడ్, డానియల్, జోహెబ్ హుస్సేన్,జీవీ ప్రశాంత్, బీఎల్వోలు అనురాధ, నాగలక్ష్మితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలపై బీజేపీ పోరుబాట

- **"40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం"**
- **'ఫీజుల బకాయిలు – బీజేపీ లడాయి' పోస్టర్ ఆవిష్కరణ**



**వనపర్తి,జులై 26 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా లక్షలాది మంది విద్యార్థుల విద్యాభవిష్యత్తును సంక్షోభంలోకి నెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆరోపించారు. వనపర్తి జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఫీజుల బకాయిలు – బీజేపీ లడాయి' పోస్టర్‌ను యువమోర్చా నాయకుడు అరవింద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా డి. నారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు పరీక్షలు రాయడం, సర్టిఫికెట్లు పొందడం, ఉన్నత విద్యను కొనసాగించడం వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా 'ఫీజుల బకాయిలు - బీజేపీ లడాయి' పేరుతో ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, రామన్నగారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా కార్యదర్శి మనీ వర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసులు, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్, యువ మోర్చా నాయకులు శివ, రాజేష్,రవి,చందు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ అశోక్ రాథోడ్

- **ఓమ్లా నాయక్ తండా సర్పంచ్ సుమిత్రా రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ అశోక్ రాథోడ్ జయంతి వేడుకలు**
- **సమాజ సేవలో అశోక్ రాథోడ్ సేవలు చిరస్మరణీయం**
- **ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సేవామూర్తి**
- **కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా డాక్టర్ అశోక్ రాథోడ్ జయంతి వేడుకలు**
- **ఆదర్శ వైద్యునికి ఓమ్లా నాయక్ తండా గ్రామస్తుల ఘన నివాళి**

**పెద్దేముల్,జులై 26 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని ఓమ్లా నాయక్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ డీసీసీ సభ్యుడు, తట్టేపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్, సర్పంచ్ గా సుదీర్ఘకాలంగా ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసి, తాండూరు మహారాజుల కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరు పొందిన స్వర్గీయ మోహన్ సింగ్ కుమారుడు ప్రముఖ ఆర్థో పెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అశోక్ రాథోడ్ జయంతి వేడుకలను ఆదివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ సుమిత్రా రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అశోక్ రాథోడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిముషాల పాటు మౌనం పాటించి స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుమిత్రా రాథోడ్, గ్రామ పెద్దలు ప్రేమ్ కుమార్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తట్టేపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ ఉప్పరి మల్లేశం తదితరులు మాట్లాడుతూ డాక్టర్ అశోక్ రాథోడ్ వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా నిస్వార్థ సేవగా భావించి సుమారు పదేళ్లపాటు ఎంతో మంది నిరుపేదలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించారని కొనియాడారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, తన సేవా దృక్పథంతో అందరి అభిమానాన్ని సంపాదించుకున్న మహోన్నత వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు.ఒక వ్యక్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలంటే సేవా తపన, అంకితభావం, మానవత్వం అవసరమని,ఆ లక్షణాలన్నీ కీర్తిశేషులు డాక్టర్ అశోక్ రాథోడ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామస్తులు,యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు అంకితమవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాయిని నారాయణ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ ఎండీ రియాజ్, గ్రామ పెద్దలు లక్ష్మణ్ రాథోడ్, పోలీస్ వినోద్, శంకర్ నాయక్, మిథున్, సంజు, మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ అశోక్ రాథోడ్‌కు ఘన నివాళులర్పించారు.



## చాపలకేరి శ్రీ మహంకాళి అమ్మవారి 30వ బ్రహ్మోత్సవాలు

- **బోనాల జాతరకు పులిమామిడి రాజును ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు**



**సంగారెడ్డి జులై 26(ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని చాపలకేరి శ్రీ మహంకాళి మందిరంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 3వ తేది వరకు నిర్వహించనున్న 30వ బ్రహ్మోత్సవాలు మరియు బోనాల జాతరకు సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజును ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతర ఆహ్వాన పత్రికను అందజేసి, ఉత్సవాలకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా జులై 31 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు కలశాల ఊరేగింపు, ప్రత్యేక అభిషేకాలు, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 1 శనివారం రాత్రి 9:00 గంటలకు తెలంగాణ సాంప్రదాయ భజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆగస్టు 2 ఆదివారం శ్రీ మహంకాళి అమ్మవారి *బోనాల పండుగ (జాతర)*ను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఆగస్టు 3 సోమవారం అమ్మవారి బ్రహ్మోత్సవాలు, గిరి ప్రదక్షిణ, కంకణ విసర్జన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.
ఈ నాలుగు రోజులపాటు జరిగే ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రీ మహంకాళి మందిరం ఆలయ కమిటీ మరియు భక్త బృందం విజ్ఞప్తి చేసింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నల్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నల్ల శంకర్, చాపల హన్మంతు, బంటు రవి, కప్పల రాము మరియు పి. ఎం. ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, తాలెల్మ రాము, ఆనంద్ (చిన్న ), తాలెల్మ రాము, సోమ శంకర్, అఖిల్ మొదలగు వారు పాల్గొన్నారు.



## నాలుగు గుంటల భూమి . సుమారు 20 లక్షల విలువైన భూదానం చేసిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి

**సంగారెడ్డి జులై 26(ప్రజాక్షేత్రం):**

సదాశివపేట మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ నిర్మాణానికి ఆత్మకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల సరళ అమరేందర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి నాలుగు గుంటల విలువైన భూమిని ఆలయానికి దానం సుమారు 20 లక్షల విలువైన భూమిని దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలందరూ పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సంగమేశ్వరా చారి మాట్లాడుతూ ఎంతో విలువైన భూమిని ఆలయానికి ఇవ్వడం చాలా సంతోషకరమని, వారి కుటుంబ సభ్యులకు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి యొక్క ఆశీర్వాదం ఉండాలని కోరారు. సందర్భంగా ఆత్మకూరు గ్రామ సర్పంచ్ నికిత బింభదర్ చారి మాట్లాడుతూ విలువైన భూమిని ఆలయానికి ఇవ్వడం చాలా గొప్ప విషయం అని, డబ్బు చాలామంది దగ్గర ఉంటుంది కానీ దానం చేసి కొందరిలో ఉంటుందని ఆ కొందరిలో మా ఊరిలోని అమరేందర్ రెడ్డి గారు ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు గురురాజు స్వామి, కల్పగూరి ప్రభు, నాగయ్య స్వామి, రమేష్, వినోద్, మరియు ఆలయ కమిటీ సభ్యులు సంగమేశ్వర్ చారి,బక్కన్న చారి ,రాములు చారి,నర్సింలు చారి, సదాశివుడు చారి,వీరన్న చారి, రామచందర్ చారి,నిరంజన్ చారి, భిక్షపతి చారి,అనిల్ చారి పాల్గొన్నారు.



## మూసాపేట్ శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవస్థానంలో శాంతి పూజలు

- **నూతన ద్వారం ప్రారంభించిన బండి రమేష్**

**కూకట్పల్లి జులై 26(ప్రజాక్షేత్రం):**

మూసాపేట్‌లోని శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ దేవస్థానంలో నిర్వహించిన శాంతి పూజలు మరియు నూతన ద్వారం ప్రారంభోత్సవం కార్యక్రమానికి శ్రీ తూము ఎల్లారావు ఆహ్వానం మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నూతన ద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక శాంతి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి అనుగ్రహం రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని,ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మయ్య,ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి,బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, ఆలయ చైర్మన్ బిక్షపతి, సీనియర్ లీడర్ కర్కి పెంటయ్య, తూము మనోజ్, హరి ప్రసాద్ నాయుడు,శంకర్,సచిన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జ్యోతిష ఆచార్య పురస్కృతులు కూరెళ్ళ నరసింహాచారికి ఘనంగా అభినందనలు

- **విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ**

**చౌటుప్పల్ జూలై 26(ప్రజాక్షేత్రం):**

జ్యోతిష పరిశోధకులు కూరెళ్ళ నరసింహాచారి జ్యోతిష శాస్త్ర ప్రతిభకు చీరాలకు చెందిన ఈశ్వర నారాయణ ఆస్ట్రో రిసర్చ్ అకాడమీ వారు జ్యోతిష ఆచార్య పురస్కారంతో సత్కరించిన సందర్భంగా విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైష్ణో పాఠశాల చౌటుప్పలలో ఘనంగా అభినందన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి సంస్థ గౌరవ సలహాదారులు అందోజు నాగభూషణము అధ్యక్షత వహించగా స్థానిక కౌన్సిలర్ పాక చిరంజీవి సీతారామచంద్ర స్వామి దేవాలయం అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి, ఎస్ కె జానీ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ముందు ముందు జ్యోతిష శాస్త్రంలో మరింత పరిశోధనలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని నరసింహ చారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల స్వామి పట్టణ మనుమయ సంఘం అధ్యక్షులు పంతంగి మదనాచారి ట్రాన్స్కో ఏడి ముటుకులోజు అశోక్ చారి విరాట్ సేన అధ్యక్షులు రాచకొండ భాస్కరాచార్యులు అడ్వకేటు యాదగిరి రెడ్డి, పోలోజు రాజు, వెంకటాచారి, పోలోజు నగేష్ చారి సంతోష్ కుమార్ శాస్త్రి నకిరేకంటి సతీష్ శానకొండ రాజు గుత్త బలి చక్రారెడ్డి అందోజు నరసింహచారి దేవరకొండ సతీష్ మైల పరమేష్ గంగాపురం నరహరి,దేవరకొండ ఉపేంద్రాచార్యులు,కాట్రేవ్ రాజయ్య, అందోజు ఉమారాణి అనుముల అక్షయ తదితరులు పాల్గొని నరసింహాచారిని ఘనంగా అభినందనించారు.

# చౌటుప్పల్ మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్‌గా బుడ్డ సురేష్

**చౌటుప్పల్ జూలై 26(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఫ్లోర్ లీడర్‌గా 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపల్ శాఖ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకుల సమక్షంలో ఫ్లోర్ లీడర్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి చెందిన బిజెపి కౌన్సిలర్లందరూ కలిసి బుడ్డ సురేష్‌ను ఫ్లోర్ లీడర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి, కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా సమస్యలపై కౌన్సిల్ వేదికగా గళమెత్తుతానని, ప్రజల పక్షాన నిలబడి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి పాల్గొనగా... నాయకులు దూడల బిక్షం గౌడ్, రమణగొని శంకర్, ఆలే శ్రీలత చిరంజీవి, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, ఉడుగు వెంకటేశం గౌడ్, ఉబ్బు బుచ్చయ్య, కాసుల వెంకటేశం, కడవేరు పాండు, గుండెబోయిన వేణు, పర్నె అంజిరెడ్డి పాల్గొన్నారు.



# విగ్రహం ఏర్పాటులో రాజకీయాలు తగవు

- **- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ**
- **అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ముందుగానే మార్కింగ్ చేయాలి**
- **షాద్‌నగర్ ముఖ్య కూడలికి అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేయాలి**

**షాద్ నగర్ జులై 26(ప్రజాక్షేత్రం):**

షాద్‌నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ముందుగానే మార్కింగ్ చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ అన్నారు. ముఖ్య కూడలిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి అన్ని పార్టీల మద్దతు ఉందని, అయితే కొందరు స్వార్థ రాజకీయాల కోసం అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు విస్తరణ అనంతరం అదే ప్రదేశంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెబుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు. రోడ్డు విస్తరణను ఎమ్మార్పీఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తుందని, అయితే విగ్రహం ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని ముందుగానే ఖరారు చేసి మార్కింగ్ ఇవ్వాలని కోరారు. షాద్‌నగర్ ముఖ్య కూడలికి అంబేద్కర్ చౌరస్తాగా నామకరణం చేసి, అక్కడే విగ్రహాన్ని ప్రతిష్టించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# లేబర్ అడ్డాల దగ్గర కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

- **కార్మికులందరికీ లేబర్ కార్డు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**
- **ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు జిల్లా అధ్యక్షులు కే రామస్వామి**
- **ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ**

**చేవెళ్ల జులై 26(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ రంగ కార్మిక నాల్గవ మహాసభలు ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు జిల్లా అధ్యక్షులు కే రామస్వామి హాజరై మహా సభను ఉద్దేశించి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కోటానుకోట్ల రూపాయలు ఉన్నాయని భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులందరూ లేబర్ కార్డులు తీసుకోని సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు మొబైల్ టాయిలెట్లు కల్పించాలని ఐదు రూపాయలకే భోజన వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ వచ్చిన తర్వాత కార్మిక వర్గంపై దాడి పెరిగిందని మోడీ తీసుకువస్తున్న ఆర్థిక సంస్కరణల వల్ల కార్మిక వర్గానికి ఎలాంటి మేలు జరగటం లేదని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని రోజురోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని వికసిత్ భారత్ అంటే ధరల మీద ధరలు పెంచడమేన అని ప్రశ్నించారు కార్మికులందరూ ఐక్యమత్యంగా ఉండి కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేయాలని తెలిపారు. ఈ మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షులుగా జే శ్రీను ఉపాధ్యక్షులుగా పి హనుమంతు ప్రధాన కార్యదర్శిగా కె శ్రీను ప్రధాన కార్యదర్శిగా జి బాబు లను ఆరుగురు కార్యవర్గం పదిమంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, శ్రీను, ఆంజనేయులు, నరసింహులు, యాదయ్య, లక్ష్మి, లీన, లలితమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ మల్లఖంబు అసోసియన్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన డాక్టర్ ఉజ్జిని మంజుల

**చౌటుప్పల్ జూలై 26(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ లో తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ జనరల్ బాడీ నిర్వహించిన సమావేశం జరిగినది ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులు మరియు కార్యదర్శులు పాల్గొన్నారు ఈ సమావేశంలో తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా చౌటుప్పల్ కు చెందిన ట్రినిటీ హై స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగినది. అలాగే కేవిబి కృష్ణ రావు గారిని చీఫ్ పాటర్న్ గా ఎన్నిక చేయడం జరిగినది. వీరికి తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ అధ్యక్షులు ముఖేష్ దేశ్ముఖ్ ఎన్నిక పత్రాలు అందజేయడం జరిగినది. అనంతరం డాక్టర్ ఉజ్జిని మంజుల గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మల్లఖంబ్ క్రీడ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తారని తెలిపారు అలాగే తన ఎన్నికకు సహకరించిన అన్ని జిల్లాల అధ్యక్షులకు కృతజ్ఞత తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ మెంబర్స్ మరియు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.



# రాళ్ళ గూడ ఫ్లై ఓవర్ కింద మురుగు నీరు చేరి వాన చోదకులకు తీవ్ర ఇబ్బందులు.

**శంషాబాద్ జులై 26(ప్రజాక్షేత్రం):**



శంషాబాద్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురుగునీరు రోడ్డుపై ఏరులై పారుతున్న పట్టించుకునే పాపాన పోవడం లేదని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోవడం జరిగిందన్నారు. అయితే అధికారులు ముందస్తు చర్యలుగా చేపట్టకుండా వ్యవరిస్తున్నారు. దీంతో స్పందించి పోయిన డ్రైనేజ్ వ్యవస్థ పొంగిపొర్లి రాలగూడ ఫ్లై ఓవర్ కింద మురుగు నీరు అంతా చేరి వాన చోదకులకు ప్రయాణించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా శంషాబాద్ సర్కిల్ అధికారులు స్పందించి ఏరులై పారుతున్న మురుగునీటికి కట్టడి చేయాలని వాహన చోదకులు డిమాండ్ చేశారు.

# అక్రమంగా పశువుల తరలింపు.. 35 పశువుల స్వాధీనం

- **రెండు బొలెరో వాహనాలు సీజ్.. నిందితులపై కేసు నమోదు**

**కుషాయిగూడ, జూలై 26 (ప్రజా క్షేత్రం):**



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పశువులను తరలిస్తున్న ముఠాపై పోలీసులు చర్యలు చేపట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు కుషాయిగూడ మార్కెట్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా, రెండు బొలెరో వాహనాల్లో ఎద్దులు, గేదెలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.పోలీసులు వాహనాలను అడ్డుకుని తనిఖీ చేయగా, మొత్తం 27 ఎద్దులు, 8 గేదెలు ఉన్నట్లు గుర్తించారు. వాహనాల్లో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ పశువుల మార్కెట్ నుంచి హైదరాబాద్‌లోని జియాగూడకు పశువులను తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం 35 పశువులను భద్రత దృష్ట్యా గోశాలకు తరలించి సంరక్షణకు అప్పగించారు. ఘటనలో ఉపయోగించిన రెండు బొలెరో వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినందుకు సంబంధిత వ్యక్తులపై కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తరలింపులో మరెవరైనా ఉన్నారా, పశువుల రవాణాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా, ఇతర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ రవాణా జరుగుతోందా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. పశువుల అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా పశువులను తరలిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కుషాయిగూడ పోలీసులు సూచించారు.

# బిఆర్ఎస్ చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షుడిగా మాదిగలకు అవకాశం ఇవ్వాలి

- **ఎమ్మార్పీఎస్జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి**

**చౌటుప్పల్ జూలై 26(ప్రజాక్షేత్రం):**



బిఆర్ఎస్ పార్టీ చౌటుప్పల్ మండల కమిటీ అధ్యక్షుడిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ ఏర్పడ్డప్పటినుండి చౌటుప్పల్ మండలంలో ఒక్కసారిగా కూడా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు మండల అధ్యక్ష పదవి ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆ పార్టీలో అధ్యక్ష పదవి చేపట్టే అన్ని అర్హతలు ఉన్న వ్యక్తులు మండల స్థాయిలో చాలామంది ఉన్నా కానీ వాళ్ళని కేవలం ఓట్లు వేయించే కార్యకర్తలుగా మాత్రమే పార్టీ వాడుకుంటుందని ఆయన అన్నారు. మండలంలో మాదిగ సామాజిక వర్గం ఓట్ల అధిక సంఖ్యలో ఉన్న విషయం బిఆర్ఎస్ పార్టీ ఆలోచించాలని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా మండల పార్టీలో మాదిగలకు సముచిత న్యాయం కల్పించలేదని ఆయన అన్నారు. మాదిగలను ఓటర్లుగా మాత్రమే చూస్తూ వాళ్లకు కనీసం ముఖ్య పదవులను ఇవ్వడానికి ఆ పార్టీ నాయకత్వం ఇష్టపడటం లేదని ఆయన అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి ఖచ్చితంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# రానున్న 3 రోజుల్లో తెలంగాణలో విస్తారంగా వర్షాలు..

**హైదరాబాద్ జులై 26(ప్రజాక్షేత్రం):**



బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ వాతావరణ మార్పుల ప్రభావం తెలంగాణపై కూడా ఉండనుంది. రాగల రెండు మూడ్రోజుల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నట్టుగా వెదర్ మ్యాన్ అంచనా వేశారు. వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కూడా వర్షాలు పడనున్నాయి. అక్కడక్కడ వానలు పడే అవకాశం ఉంది. హైదరా బాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, అక్కడక్కడ చినుకులు లేదా మోస్తరు వర్షం పడే సూచనలు ఉన్నాయి. ఉపరితల గాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రయాణాలు చేసే వారు, లోతట్టు ప్రాంతాల నివాసితులు వాతావరణ హెచ్చరికలను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ పిలుపు


**హైదరాబాద్ జులై 26(ప్రజాక్షేత్రం):**

ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ పిలుపు హైదరాబాద్: అణగారిన దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 10న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు సంగటి మనోహర్ మహాజన్, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంగటి చిన్న యోసేపు తెలిపారు. సంబంధిత కరపత్రాన్ని హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో కమిటీ గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిషప్ సంజయ్ ఆనంద్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తింపజేసేలా చట్టాన్ని సవరించాలని కోరారు.



## వినోదాల... సౌండ్ ఇంజినీర్

కథానాయకుడు నారా రోహిత్ సరికొత్త కథతో ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమయ్యారు. ఆయన.. కథానాయిక నయన్ సారిక జంటగా రూపొందుతున్న సినిమా 'సౌండ్ ఇంజినీర్'. చినిమిల్లి మణికుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ చౌదరి చెరుకూరి నిర్మిస్తున్నారు. శనివారం రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా ఓ కాన్సెప్ట్ వీడియోతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కొత్త అవతారంలో కనిపిస్తున్న రోహిత్ పాత్రని వినికిడి లోపం ఉన్న వ్యక్తిగా తీర్చిదిద్దినట్టు స్పష్టం చేసింది. ఈ సినిమాలో నరేశ్ వీకే, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, రోహిణి, సంపత్, అజయ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.



## ఆత్మకథ రాయనున్న సూపర్‌స్టార్.. సినిమాగా కూడా రానుందా?

సూపర్‌స్టార్ రజనీకాంత్ (Rajinikanth) అభిమానులకు ఓ శుభవార్త. ఆయన తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారని నెట్టింట వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఆయన బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా, రజనీకాంత్ కొంతకాలంగా ఈ పుస్తకం రాసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. కేవలం పుస్తకమే కాకుండా, ఈ ఆత్మకథను సినిమాగా (బయోపిక్) కూడా తీసుకురావాలని ఆయన భావిస్తున్నారట. ఈ ఆలోచనపై తనకు అత్యంత సన్నిహితులైన వారితో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, పుస్తకం లేదా సినిమాపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

ఇక, రజనీకాంత్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జైలర్ 2' చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 15న విడుదల కానుంది. ప్రస్తుతం 'ధర్మన్' మూవీ షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు.



## మెగాస్టార్ బర్త్ డే కానుకగా 'మెగా158' నుంచి బిగ్ అప్డేట్.!




మెగాస్టార్ చిరంజీవి వరుస భారీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అభిమానులను అలరించడంతో పాటు యంగ్ హీరోలకు పోటీగా నిలుస్తున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర' విడుదల కాకముందే.. టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ చిత్రాన్ని లైన్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మళ్లీ వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ మూవీపై భారీ అంచనాలు భారీగా నెలకొన్నాయి. 'మెగా158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత ఘనంగా నిర్మిస్తున్నారు.

యాక్షన్ అండ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో కోలీవుడ్ సీనియర్ నటుడు శరత్ కుమార్ విలన్‌గా నటిస్తుండగా, కమెడియన్ డాక్టర్ భద్రం కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నప్పటికీ, మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక పోస్టర్ లేదా అప్‌డేట్ రాలేదు. దీంతో ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని మెగా అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మెగా ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించే ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వచ్చే నెల ఆగస్ట్ 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భం గా ఈ సినిమాకు సంబంధించిన ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోందని టాక్.

## ఓటీటీ ఎంట్రీకి సిద్ధమైన శ్రీకాంత్ 'ఆబ్జెక్షన్ మై లార్డ్'..

టాలీవుడ్ సీనియర్ నటుడు శ్రీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన వెబ్ సిరీస్ 'ఆబ్జెక్షన్ మై లార్డ్ - నోటరీ పరశురామ్: చాప్టర్ 1'. ఇందులో ముఖేష్ రిషి ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. కోర్ట్‌రూమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ తెలుగు ఓటీటీ ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేసేందుకు సిద్ధమైంది. జీ5 ఈ వెబ్ సిరీస్‌ను జూలై 31 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ సిరీస్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌లో శ్రీకాంత్, ముఖేష్ రిషి ఒకరినొకరు తీవ్రంగా ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తుండగా, దిగువన మంటల్లో చిక్కుకున్న వ్యక్తి విజువల్ కథపై మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. న్యాయం, నేరం, కుట్రల నేపథ్యంలో సాగే కోర్ట్‌రూమ్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ రూపొందినట్లు పోస్టర్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ వెబ్ సిరీస్‌కు సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించగా, డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించారు. అరుణ్ చిలువేరు సంగీతాన్ని అందించారు.




## ఇతరులను చూసి నన్ను నేను మార్చుకోలేదు..

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ఎన్నో హిట్ చిత్రాలతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీ అయిపోయారు. లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నారు. ఎలాంటి డూప్ లేకుండా స్వయంగా రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. 'మైసా'లో అండర్ వాటర్‌లో బిగ్ అడ్వెంచర్ చేశారు. ఇప్పటివరకూ ఇండియన్ సినీ చరిత్రలో చూడని ఓ బిగ్ సీక్వెన్స్ చేసి రికార్డ్ క్రియేట్ చేశారు. గొండ్ తెగ, సంస్కృతి నేపథ్యంతోపాటు వారికి అండగా ఉండే ఓ వారియర్ పాత్రలో గొండు మహిళగా రష్మిక ఇందులో కనిపించబోతున్నారు. రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ బిజీగా ఉన్న రష్మిక తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా సినీ ఇండస్ట్రీలో అందరూ వెళ్లే దారిలోనే తాను వెళ్లలేదని.. ఎప్పుడూ తన మనసుకు నచ్చినట్లే నడుచుకున్నానని చెప్పారు. అదే తన విజయంలో అతిపెద్ద కారణమని వెల్లడించారు. హిందీ సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్న సమయంలో అందరిలా ఒకే తరహా దారిలో వెళ్లకుండా, తన అంతరాత్మ చెప్పిన మాటే విన్నానని అందుకే ఈ స్థాయిలో ఉన్నానని రష్మిక అన్నారు. మొదట్లో ఈ నిర్ణయం కాస్త భయాన్ని కలిగించినప్పటికీ, చివరికి అదే ఇండస్ట్రీలో ఒక ప్రత్యేకమైన ఐడెంటిటీని తెచ్చిపెట్టిందని చెప్పారు. ఇతరులను అనుకరించడం లేదా పక్కవారి మెప్పు కోసం జీవించడం కాకుండా.. ఎవరికి వారు తమ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయమని అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని ఇస్తూ.. ఎవరినీ చూసి కాపీ కొట్టాల్సిన అవసరం లేదు. పక్కవారి మెప్పు కోసం లేదా ప్రశంసల కోసం మిమ్మల్ని మీరు మార్చుకోకండి. మనం ఎలా ఉన్నామో అలాగే నిజాయితీగా ఉండటంలోనే మన అసలైన విలువ ఉంటుంది. మన వ్యక్తిత్వమే మనకు అతిపెద్ద బలం అని స్పష్టం చేశారు.




## ఆంధ్ర హక్కులకు అన్ని కోట్ల డిమాండ్ చేస్తున్న 'ది ప్యారడైజ్' మేకర్స్



నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన అన్ని ఏరియాల థియేట్రికల్ హక్కులను విక్రయించేందుకు నిర్మాతలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రి సంస్థ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం రాయలసీమ మినహా ఆంధ్ర ఏరియా థియేట్రికల్ హక్కుల కోసం మేకర్స్ రూ.35 నుంచి రూ.40 కోట్ల మధ్య ధరను కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రాయలసీమ లేకుండానే ఆంధ్ర హక్కులకు ఇంత భారీ మొత్తం డిమాండ్ చేయడం విశేషంగా మారింది. ఈ పెట్టుబడిని రికవరీ చేయాలంటే ఆంధ్ర ప్రాంతంలోనే దాదాపు రూ.70 నుంచి రూ.80 కోట్ల గ్రాస్ వసూళ్లు రావాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాంటి స్థాయి కలెక్షన్లు సాధించాలంటే సినిమాకు సూపర్ హిట్ టాక్ రావడం తప్పనిసరి అని వారు భావిస్తున్నారు. మరి చివరికి రాయలసీమ మినహా ఆంధ్ర ఏరియా హక్కులు ఎంత మొత్తానికి అమ్ముడవుతాయో ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో ఖయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చేరుకూరి నిర్మిస్తున్నారు.

## కారు కొనుక్కోవడానికే సినిమాల్లోకి వచ్చా

*కారు కొనాలనే కోరికతో నటించిన తొలి సినిమానే తనని ఈ రోజు కెమెరా ముందు నిలబెట్టిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న ఆమె ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించడం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. "నేను కాలేజీలో చదువుతున్నప్పుడే అనుకోకుండా కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి నాకొక అవకాశం వచ్చింది. ఎవరో కొంతమంది నా ఫొటోలు చూసి మా నాన్నని కలిశారు. ఓ సినిమాలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. సినిమాలపై అప్పడంతగా అవగాహన లేదు. కానీ, వాళ్లు ఆ సినిమాకు నాకు రూ.5 లక్షల పారితోషికం ఇస్తామన్నారు. వాటితో కారు కొనుక్కోవాలి.. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతానన్న ఒకే ఒక్క కారణంతో ఆ సినిమా చేయడానికి అంగీకరించాను. 40 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. అప్పడే గ్రహించా కెమెరా ముందు ఉండడం నాకు ఎంతగానో ఇష్టమని. ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తర్వాత నటనలోకి రావాలని నిర్ణయించుకున్నా. అందుకే కొంత విరామం తీసుకుని 2013లో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. ఎవరి ప్రమేయం లేకుండానే ఇండస్ట్రీలో అడుగుపెట్టాను. నాకు నేనుగా అన్నీ నేర్చుకున్నా. ప్రారంభంలో చదువు కారణంగా కొన్ని పెద్ద సినిమాల్ని వదులుకోవల్సి వచ్చింది"అని అంది రకుల్. 2009లో కన్నడ చిత్రం 'గిల్లీ'తో వెండితెరకు పరిచయమైన ఆమె తిరిగి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'(2013)తో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఇప్పుడామె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న హిందీ చిత్రం 'రామాయణ'లో శూర్పణఖగా కనిపించనుంది.*




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394